క్లుప్తంగా

పేద విద్యార్థుల చదువుకు ఆర్థికసాయం



నగదును పాఠశాల కరస్పాండెంట్‌కు అందజేస్తున్న విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు

కోవెలకుంట్ల: పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇద్దరు పేద విద్యార్థుల చదువుకు సోమవారం ఆర్థిక సాయమందించారు. స్థానిక సీతారాంనగర్ కాలనీకి చెందిన రాంచరణ్, అఖిల్‌ను పట్టణంలోని గాయత్రీ విద్యామందిరంలో చేర్పించి వారి చదువుకు అయ్యే ఫీజును ఏటా అందజేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన రూ.21 వేల నగదును ఫౌండేషన్ అధ్యక్షుడు గోపిరెడ్డి విక్కీ పాఠశాల కరస్పాండెంట్ కృష్ణప్రియకు అందజేశారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులకు దుస్తులు, టోపీలను అందజేస్తున్న సర్పంచ్

బేతంచెర్ల: ఈనెల 10న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలలో పాల్గొననున్న గోరుమానుకొండ గ్రామానికి చెందిన క్రీడాకారులకు సర్పంచ్ వెంకటేశ్వర్లు క్రీడాదుస్తులు, టోపీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలకు శ్రీకారం చుట్టారన్నారు.

యాచకుడికి సపర్యలు



యాజకుడికి సపర్యలు చేస్తున్న సభ్యులు

డోన్ టౌన్: పట్టణంలో యాచిస్తూ జీవనం సాగిస్తున్న సాంబకు స్ఫూర్తి సేవా సమితి సభ్యులు సోమవారం సపర్యలు చేశారు. తిరుపతి ప్రాంతానికి చెందిన సాంబ కొంత కాలం క్రితం డోన్‌కు వచ్చి ఇక్కడే యాచిస్తూ జీవిస్తున్నాడు. నాలుగు రోజుల నుంచి అనారోగ్యానికి గురై నీరసించి పాతపేట ప్రాంతంలో మురుగు కాల్వ పక్కన పడి ఉండటంతో స్థానికులు గుర్తించి స్ఫూర్తి సేవా సమితి సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమితి సభ్యులు మధు, రాము, చంద్ర, గోవిందరెడ్డి, సురేష్, అంజి, యోగ అక్కడికి చేరుకుని సాంబకు స్నానం చేయించి సపర్యలు చేసి, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు.

నేడు అంబేడ్కర్ చిత్రపటాలకు పాలాభిషేకం

డోన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19న విజయవాడలో ఏర్పాటు చేస్తుండటాన్ని పురస్కరించుకుని ఆయన చిత్రపటాలకు మంగళవారం పాలాభిషేకం చేయనున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం అధ్యక్షులు పోస్టుప్రసాద్ అన్నారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో సోమవారం పోస్టు ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు ధర్మవరం గొల్ల శ్రీను, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలను జయప్రదం చేయండి

ప్యాపిలి: ఈనెల 12, 13 తేదీలలో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న ఎస్టీయూ వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని ఎస్టీయూ మండల అధ్యక్షులు హాజీ మస్తాన్ వలి, ప్రధాన కార్యదర్శి చంద్రమౌళి కోరారు. మండల పరిధిలోని ఎన్ రాచర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఎస్టీయూ వజ్రోత్సవాల పోస్టర్‌లను వారు ఆవిష్కరించారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

బేతంచెర్ల: అన్ని కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. సోమవారం హనుమాన్ నగర్ కాలనీలో రూ.10 లక్షలతో వేస్తున్న మట్టి రోడ్లను పరిశీలించారు. వారి వెంట సింగిల్ విండో అధ్యక్షులు నారాయణ ఉన్నారు.

కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేత



శ్యామలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అవుకు: మండల కేంద్రానికి చెందిన కందూరి శ్యామలమ్మ కొన్ని రోజులుగా అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ దివ్య సోమవారం కర్నూలుకు వెళ్లి శ్యామలమ్మకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము రూ.3 వేలు అందజేశారు.

అభివృద్ధి అదరహో..

జగనన్న ప్రభుత్వం అభివృద్ధిలో సంజామలం ముక్కమల్ల గ్రామానికి అగ్రతాంబూలం ఇచ్చింది. సచివాలయం, రైతు భరోసా, హెల్త్‌క్లినిక్ తదితర భవనాలు ఏర్పాటు చేసి, ప్రజలకు గ్రామంలోనే అన్ని రకాల సేవలందిస్తోంది. రూ.1.4 కోట్లతో సంపు, పంపు హౌస్, ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చింది. రూ.54 లక్షలతో పాఠశాల భవనాన్ని తీర్చిదిద్ది పేద పిల్లలకు కార్పొరేట్ విద్యనిందిస్తోంది. జగనన్న కాలనీ పేరుతో 137 మందికి ఇంటి స్థలాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణాలను యజ్ఞంలో చేస్తోంది.



- ముక్కమల్ల గ్రామంలో రూ.80 లక్షలతో సచివాలయం, రైతుభరోసా, హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణం
- రూ.1.4 కోట్లతో సంపు, పంపు హౌస్, ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ఏర్పాటు
- రూ.54 లక్షలతో నాడు నేడు కింద పాఠశాల అభివృద్ధి
- జగనన్న కాలనీలో 137 మందికి ఇళ్లు మంజూరు.. కొనసాగుతున్న నిర్మాణాలు



సంజామల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముక్కమల్ల గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, ప్రాంత, రాజకీయాలకు అతీతంగా గ్రామాలను తీర్చిదిద్దేందుకు ఆదేశాలివ్వడంతో అధికారులు ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు శ్రమిస్తున్నారు. పేద కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందజేస్తూ మరో పక్క అభివృద్ధిపై దృష్టి సారించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ.6.12 కోట్లు వెచ్చించి గ్రామ ప్రజల శ్రేయస్సుకు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలు ఏర్పాటు చేయడంతో గ్రామం కళకళలాడుతోంది. ఏళ్లుగా పరిష్కారం దొరకని తాగు నీటి సమస్యకు ఈ ప్రభుత్వంలో పరిష్కారం దొరికింది. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం నాడు - నేడు కింద పాఠశాల రూపురేఖలను మార్చేసింది. సీసీ రోడ్ల నిర్మాణం, గ్రావెల్ రోడ్ల నిర్మాణం ఇలా ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని సమస్యలను సైతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిష్కరించడతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధి పనుల్లో కొన్ని..

- గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి రూ.1.4 కోట్లతో ఓహెచ్‌ఆర్ ట్యాంక్, పంపు, సంపు హౌస్ నిర్మాణం
- రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం
- రూ.22 లక్షలతో నూతన రైతుభరోస కేంద్రం
- రూ.18 లక్షలతో నూతన ఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్
- గ్రామంలో వివిధ కాలనీలలో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- రూ.20 లక్షలతో గ్రామంలో వివిధ రస్తాలకు గ్రావెల్ రోడ్ల నిర్మాణం
- రూ.54 లక్షలతో జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధి
- 137 మందికి ఇళ్లు మంజూరు. వాటికి దాదాపు రూ.2.46 కోట్లు ఖర్చు

గ్రామంలో రూ.6.12 కోట్ల అభివృద్ధి పనులు



మాగ్రామానికి దాదాపు రూ.6.12 కోట్లు ఖర్చు చేశారు. ప్రజల సమస్యలను వలంటీర్ వ్యవస్థ ద్వారా తెలుసుకుని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారిస్తున్నాం. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగు నీటి సమస్యలకు పరిష్కారం లభించడం సంతోషంగా ఉంది. కొత్త ప్రభుత్వ భవనాలతో గ్రామం అందంగా కనపడుతుంది. – పోచా శీలా రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జ్

ప్రజల వద్దకే పాలన



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వస్తున్నాయి. గతంలో ఇల్లు మంజూరు చేయమని మండల కార్యాలయం చుట్టూ తిరిగేవాన్ని, కానీ జగనన్న ప్రభుత్వంలో మండల అధికారులే గ్రామానికి వచ్చి ఇల్లులేని వారిని గుర్తించి గృహాలను మంజూరు చేశారు. నేను ఇల్లు నిర్మించుకున్న. చాలా సంతోషంగా ఉంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు ప్రజల వద్దకే పాలన అనేవారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అది నిజం చేశారు.

– మంగళి సుబ్బరాయుడు, ముక్కమల్ల

రోడ్డు వేశారు



గత ప్రభుత్వంలో సీసీ రోడ్డు లేక మా ఇంటి ముందర మురికి నీళ్లు నిల్వ ఉండడంతో దుర్వాసన వచ్చేది. రోగాల బారిన పడి ఇబ్బంది పడేవాళ్లం. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్డు వేయడంతో మా ఇంటి ముందర మురుగునీరు నిల్వ లేదు. ఇప్పుడు మా ఇంటి సందు మొత్తం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మా కాలనీ వాసుల తరపున ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి కృతజ్ఞతలు.

– చాకలి సుబ్బరాయుడు



ముక్కమల్లలో నిర్మించిన సీసీ రోడ్డు



ముక్కమల్లలో గ్రావెల్ రోడ్డు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

బెలుంలో టీడీపీకి బిగ్‌షాక్



పార్టీలో చేరిన బీసీ కుటుంబాలతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

- వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

కొలిమిగుండ్ల: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల ఆశీర్వాదంతో మరో సారి బనగానపల్లె గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బెలుం గ్రామానికి చెందిన వంద బీసీ కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరడంతో టీడీపీకి బిగ్‌షాక్ తగిలింది. ఎమ్మెల్యే కాటసాని గ్రామానికి చేరుకోగానే ఘనస్వాగతం పలికారు. మొదటి నుంచి టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న బీసీ కుటుంబాలకు చెందిన బోయ వెంకటసుబ్బయ్య, రాజు, శ్రీనివాసులు, లక్ష్మన్న, కిట్టు, పెద్ద కొండన్న, రవీంద్ర, మౌలాలి, శివన్నతో పాటు వంద కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీపై అభిమానంతో బీసీ కుటుంబాలు పెద్ద ఎత్తున పార్టీలోకి రావడం సంతోషకరమన్నారు.

ఎవరిది కక్ష్య సాధింపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనింగ్ పరిశ్రమ కష్టాల్లో పడిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్ధనరెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని నాపరాతి గనుల యజమానులపై కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడిందెవరో అందరికీ తెలుసన్నారు. కొలిమిగుండ్ల, అవుకు మండలాల్లో యజమానులపై రూ.కోట్లలో జరిమానా విధించిన పాపం నీది కాదా అని ప్రశ్నించారు. మైనింగ్ యజమానులపై రూపాయి కూడా జరిమానా విధించని చరిత్ర వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా మైనింగ్ గురించి మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాచం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బాచం వెంకటసుబ్బారెడ్డి, దస్తగిరి, నరసింహుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శీలయ్య, శివ, బాషా, సుబ్బరాయుడు, దానమయ్య, కొండయ్య, మారం శేఖర్, బాలరాజు పాల్గొన్నారు.



కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

తైక్వాండో ప్రీమియర్ లీగ్‌కో కన్వీనర్‌గా శ్రీదేవి



తెలుగు ఎన్నారై రేడియో ఆర్‌జే శ్రీదేవి

బేతంచెర్ల: ఈనెల 21, 22 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే తైక్వాండో ప్రీమియర్ లీగ్ కో ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన తెలుగు ఎన్నారై రేడియో ఆర్‌జే శ్రీదేవి నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిసారి ఇలాంటి అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో అమెరికా, సౌత్ కొరియా దేశాలతో పాటు వివిధ దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

నంద్యాలలోని పద్మావతి నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 7న జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో బేతంచెర్ల ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థినులు మధుభార్గవి, సరస్వతి, హరిత బంగారు పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు కరాటే మాస్టర్ శివ కుమార్ తెలిపారు. 3వ తరగతి విద్యార్థిని సంధ్య, 9వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్‌బాబు సిల్వర్ మెడల్ సాధించారన్నారు. కర్నూలులో జరిగిన సౌత్ ఇండియన్ కరాటే చాంపియన్ షిప్‌పోటీలలో గోల్డ్, సిల్వర్ మెడల్ సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాణ్యం సిమెంట్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ, కోచ్ శివ కుమార్ అభినందించారు.

- **కోవెలకుంట్ల:** నంద్యాలలో రెండు రోజుల క్రితం జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో సెయింట్ జోసఫ్స్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్‌ఎం గీత తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు నుమాన్ బంగారు పతకం, కృష్ణసాయి వెండి, యశ్వంత్‌రెడ్డి, కృష్ణస్వామి, సాత్విక్‌లు రజిత పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను పీఈటీలు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులతో కలిసి ఆమె అభినందించారు.

సంక్రాంతి ముందస్తు సంబరాలు



బేతంచెర్ల ఏపీ మోడల్ స్కూల్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించిన దృశ్యం

బేతంచెర్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఏపీ మోడల్ స్కూల్‌లో సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించారు. ఆయా పాఠశాలలో ముగ్గుల పోటీలు, హరిదాసు వేషధారణలు, భోగిమంటలు, గాలి పటాలు ఎగరేయడం, ఆటల పోటీలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు.

ప్యాపిలి: స్థానిక ప్రియదర్శిని పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. హెచ్‌ఎం పార్థసారథి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినులు ఉత్సాహంగా ముగ్గులు వేశారు.

జగనన్న హయాంలో పారదర్శక పాలన

- మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్

కోవెలకుంట్ల: సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా జగనన్న హయాంలో పారదర్శక పాలన సాగుతోందని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. సోమవారం భీమునిపాడు గ్రామంలో రూ.1.32 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించారు. జలజీవన్ మిషన్ ద్వారా రూ.56 లక్షలతో ఓవర్‌హెడ్‌ట్యాంకు, పైప్‌లైన్‌నిర్మాణానికి భూమి పూజ, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి సహకారంతో రూ.10 లక్షలతో అదమా కంపెనీ ఏర్పాటు చేసిన ఉచిత మినరల్‌వాటర్ ప్లాంట్, రూ.38.40 లక్షతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో ఏర్పాటు చేసిన రైతు భరోసాకేంద్రం, రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. కార్యక్రమానికి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, కోవెలకుంట్ల ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణ రెడ్డి, గ్రామ సచివాలయ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, పార్టీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, దుత్తల చిన్న నరసింహారెడ్డి, భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. 2014లో 600లకు పైగా హామీలిచ్చి గద్దెనెక్కిన చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మోసం చేశారన్నారు. త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానుండటంతో ఎలాగైనా అధికారంలోకి రావాలని కుట్రలు, కుతంత్రా లు, అపద్ధపు హామీలను గుప్పిస్తున్నాడని, వాటిని నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఫ్యాక్షన్ ముద్ర ఉన్న భీమునిపాడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా నిలుపుతామన్నారు. కోవెలకుంట్ల–ఆళ్లగడ్డ ఆర్‌అండ్‌బీ రహదారిలో గ్రామ సమీపంలో కుందరవాగుపై ఉన్న వంతెనను వెడల్పు చేసి ఆధునీకరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో సీసీరోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు ప్రదీప్‌కుమార్, ఎల్వీ సుధాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లోకేశ్వరరెడ్డి, బాలమద్దిలేటి, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు వీరారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు గోదుల ఓబుళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అయోధ్యకు ఆహ్వానం



శంకరానంద గిరి స్వామికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: ఈనెల 22న అయోధ్యలో జరగనున్న రామమందిరం ప్రారంభోత్సవానికి హాజరు కావాలని రామ జన్మభూమితీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యులు కంబయ్య, రాంప్రసాద్, బుగ్గన చంద్రమౌలీశ్వర్ రెడ్డి, గౌరి హుసేన్‌రెడ్డి, నాగమోహన్, శ్రీను, ధరణి, అజయ్.. మండలంలో పలువురికి సోమవారం ఆహ్వాన పత్రికలు అందజేశారు. బుక్కాపురం కైలాస ఆశ్రమ అధిపతి శంకరానంద గిరి స్వామితో పాటు పలువురికి ఆహ్వాన పత్రికలు అందజేశారు.

టిక్కెట్ కౌంటర్ ఏర్పాటు



టిక్కెట్ కౌంటర్ వద్ద దాతలతో ఈఓ

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయంలో బనగానపల్లె శ్రీమారుతి షాపింగ్‌మాల్ యజమాని గుండా రవికుమార్ బ్రదర్స్ సహకారంతో ఏర్పాటు చేసిన టిక్కెట్ కౌంటర్‌ను సోమవారం ఆర్యవైశ్య మహిళా మండలి జిల్లా అధ్యక్షురాలు గుండా నాగసుప్రజ ప్రారంభించారు. ఆలయ ఈఓ రామానుజన్ మాట్లాడుతూ గుండా రవికుమార్ బ్రదర్స్ అమ్మవారిపై ఉన్న భక్తితో రూ.1.25 లక్షల విలువైన టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం దాతలను సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల: భర్త, అత్త, మామలపై ఓ మహిళ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. హెడ్ కానిస్టేబుల్ సజ్జద్ అలీ తెలిపిన వివరాలు.. డ్రైవర్స్ కాలనీకి చెందిన ఆదిలక్ష్మి, ఉలిందకొండకు చెందిన రవితో 3ఏళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలానికే భర్త రవితోపాటు అత్త వెంకటలక్ష్మమ్మ, మామ జానకీరాముడు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆదిలక్ష్మి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఆపివున్న ఆటోను ఢీకొన్న బైక్

- పలువురికి గాయాలు

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామ శివారులో ప్రధాన రహదారి పక్కన ఆపివున్న ఆటోను బైక్ ఢీకొనడంతో పలువురుకి స్వల్ప గాయాలయ్యాయి. ఆకుమల్ల నుంచి అవుకుకు బైక్ మీద ముగ్గురు వ్యక్తులు వెళ్తుండగా ఆకుమల్ల – సింగనపల్లె గ్రామాల మధ్యలో ప్రమాదం జరిగింది. బైక్‌పై ఉన్న రవి, సాయి, మహీంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. తోటి వాహనదారులు 108 సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోలుకోలేక యువకుడి మృతి

డోన్ టౌన్: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఈనెల 1న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాశిపోగుల మల్లికార్జున(20) కోలుకోలేక కర్నూలు ఆసుపత్రిలో ఆదివారం మృతిచెందాడు. ప్యాపిలి మండలం మెట్టుపల్లెకి చెందిన మల్లయ్య కొన్నేళ్లుగా శ్రీనివాసనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 1న బైకుపై కొత్త బస్టాండ్ వైపు నుంచి గుత్తి రోడ్డు వైపునకు వెళ్తూ ప్రమాదానికి గురయ్యాడు.

ఘనంగా మోడల్ స్కూల్ వార్షికోత్సవం



తహసీల్దార్ విద్యాసాగర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓ ప్రభాకర్ హాజరై పాఠశాలలో నూతనంగా నిర్మించిన ఓపెన్ స్టేజ్ ఆడిటోరియాన్ని ప్రారంభించారు. ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రోటరీ క్లబ్ సహకారంతో స్టడీ మెటీరియల్, బ్యాగ్స్ అందించారు.

సమాజ సేవలో పాలు పంచుకోవాలి



వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

బేతంచెర్ల: సమాజ సేవలో పాలుపంచుకోవాలనీ వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ జయంతి వెంకటేశ్వర్లు, వనితా క్లబ్ ఇంటర్ నేషనల్ డైరెక్టర్ గుండా నాగసుప్రజ సూచించారు. సోమవారం పట్టణంలోని అమ్మవారిశాల్లో 2024 వాసవీ క్లబ్ అధ్యక్షులుగా వెంకటసుబ్బయ్య గుప్త, కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారి మధుసురేంద్ర, వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా వంకదారి సుభాషిణి, ఇందుమతి, కోశాధికారి నాగజ్యోతితో పాటు మరి కొంత మంది కార్యవర్గ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వాసవీ క్లబ్ జిల్లా ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఎన్నికైన బళ్లాని సూర్యను వైఎస్సార్‌సీపీ మండల నాయకులు బాబుల్‌రెడ్డి, చందురెడ్డి, ఆర్యవైశ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు గుండాగోపాల్, అధ్యక్షులు మోహన్‌రావు, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సంతాపం

బనగానపల్లె రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ (గ్రామ తలారి) ఎర్రమల(57) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత ఓబులరెడ్డి గ్రామానికి వెళ్లి ఎర్రమల మృతదేహంపై పూలమాల వేసి, సంతాపం తెలిపారు.